



● అంకాపూర్ మార్కెట్‌లో పచ్చిబుట్టల ఆటో ట్రాలీలు

పచ్చిబుట్టకు భలే డిమాండ్

ఆర్మూర్‌రూరల్, జూలై 29: మొక్కజొన్న పచ్చిబుట్ట అంటే మొదట గుర్తుకు వచ్చేది మండలంలోని అంకాపూర్ గ్రామం. 20ఏళ్లుగా పచ్చిబుట్ట సాగు, విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. జిల్లా కేంద్రం నుంచి 63వ జాతీయ రహదారి వెంబడి ఇతర జిల్లాలైన నిర్మల్, ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్ ప్రాంతాలకు వెళ్లే వాహనదారులు అంకాపూర్‌లో ఆగాల్సిందే. నోరూరించే కాల్చిన మొక్కజొన్న కంకులను కొనుగోలు చేయడమే కాకుండా పచ్చిబుట్టను తీసుకువెళ్తుంటారు. అంకాపూర్ మొక్కజొన్న పచ్చిబుట్టకు ఉన్న డిమాండ్ ఇది. అంకాపూర్ గ్రామం మొక్కజొన్న పచ్చిబుట్ట విక్రయాలకు రాష్ట్రంలోనే ప్రసిద్ధిగాంచింది.


పచ్చిబుట్టకు పుట్టినిళ్లు అంకాపూర్..

ఆర్మూర్ మండలం అంకాపూర్ గ్రామం పచ్చిబుట్ట సాగుకు పుట్టినిళ్లుగా భావిస్తారు. ప్రతీ సంవత్సరం ఆర్మూర్ ప్రాంతంలో వందల ఎకరాల్లో ఈ పచ్చిబుట్ట సాగు చేసి అనంతరం ఇతర పంటలను సాగు చేస్తుంటారు. ఈ సంవత్సరం అంకాపూర్‌లోనే సుమారు 300ఎకరాల్లో పచ్చిబుట్టను సాగు చేస్తున్నారు. గతంతో పోలిస్తే ఈయేడు రైతుకు గణనీయంగా ధర లభిస్తోంది. రాష్ట్రంలోని ఇతర జిల్లాలతో పాటు మహారాష్ట్రలోని నాగాపూర్, నాందేడ్, ఏపీలోని పలు పట్టణాలకు పచ్చిబుట్టను ఎగుమతి చేస్తుంటారు. ప్రతీరోజు 60నుంచి 80 ఆటోలు, ఆటోట్రాలీలు, ఇతర వాహనాల్లో విక్రయాలు జరుగుతుంటాయి. ప్రస్తుతం ఆటోట్రాలీ పచ్చిబుట్ట ధరరూ.10వేల నుంచి రూ.10వేల500 వరకు పలుకుతోంది.

చిన్నవ్యాపారులకు జీవనోపాధి..

అంకాపూర్ గ్రామంలో పచ్చిబుట్ట సాగు విక్రయం వల్ల చిన్నవ్యాపారులకు సైతం జీవనోపాధిగా మారింది. జూన్ నెల చివరిలో మార్కెట్‌లోకి వచ్చి అక్టోబర్ వరకు అమ్మకాలు జరుగుతాయి. ఉదయమే చిరువ్యాపారులు కంకులను కొనుగోలు చేసి ఇతర ప్రాంతాలకు తీసుకెళ్తారు. కొందరు గ్రామంలోనే జాతీయ రహదారి వద్ద మొక్కజొన్న కంకులను కాల్చి అమ్ముతుంటారు. సుమారు 40కిపైగా కుటుంబాలు ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 200మంది దీనిపై ఆధారపడి జీవనోపాధి పొందుతున్నారు.





- నేడు లక్షా 50వేల వరకు రుణ మాఫీకి సన్నాహాలు
- జిల్లాలో 22,868 మంది రైతులకు కలగనున్న లబ్ధి
- 210 కోట్ల 53లక్షల 87,938 రూపాయల రుణమాఫీ

రెండో విడతకు సర్వం సిద్ధం

నిజామాబాద్ అర్బన్, జూలై 29: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతులకు రెండు లక్షల లోపు పంట రుణమాఫీలో మంగళవారం నుంచి రెండో విడత రుణమాఫీకి సర్వం సిద్ధమైంది. ఈనెల 18న లక్ష వరకు పంటల రుణ మాఫీ చేసిన ప్రభుత్వం మంగళవారం లక్షా 50వేలలోపు రుణాలున్న రైతులకు రుణమాఫీ చేయనుంది. మంగళవారం సాయంత్రం వరకు లక్షా 50వేల లోపు రుణం కలిగి ఉన్న రైతుల ఖాతాల్లోకి డబ్బులు జమ చేయనున్నారు. మొదటి విడతలో లక్షలోపు జిల్లా వ్యాప్తంగా 44,469 మంది రైతులకు రుణమాఫీ చేసిన ప్రభుత్వం రైతుల ఖాతాల్లో 225 కోట్ల 61లక్షల 66,416 రూపాయలను రైతుల ఖాతాల్లో జమ చేసింది. మంగళవారం లక్షా 50వేల లోపు పంట రుణం కలిగిన 22,868 మంది రైతుల ఖాతాల్లో 210 కోట్ల 53లక్షల 87వేల 938 రూపాయలను రైతుల ఖాతాల్లో వేయనున్నారు. ఇప్పటికే మండల వ్యవసాయ అధికారులు లక్షా 50వేలలోపు పంటరుణం మాఫీ పొందనున్న రైతుల జాబితాను సిద్ధం చేశారు. మంగళవారం రాష్ట్రస్థాయిలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తదితరులు అధికారికంగా లక్షా 50వేలలోపు పంట రుణాలను మాఫీ చేసే చెక్కులను పంపిణీ చేయనున్నారు. జిల్లాలో ఉదయం 11గంటలకు జిల్లా సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో రెండవ విడత రుణమాఫీ నిధుల విడుదల కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. వచ్చేనెల మొదటి వారంలో రెండులక్షలలోపు రుణాలను కూడా మాఫీ చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది.

67వేల 337 మంది రైతులకు లబ్ధి..

బ్యాంకుల నుంచి రెండు లక్షలలోపు పంట రుణాలు తీసుకున్న రైతులకు పంట రుణాలను పూర్తిగా మాఫీ చేస్తామని గత ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిన మేరకు కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం రుణమాఫీకి శ్రీకారం చుట్టింది. జిల్లాలో 2లక్షలలోపు రుణాలు తీసుకున్న రైతులు సుమారు లక్షా 50వేల మందికి పైగా ఉన్నారు. వీరిలో లక్షలోపు రుణాలు తీసుకున్న రైతులకు మొదటి విడతగా ప్రభుత్వం 44వేల 469 మందికి రుణాలను మాఫీ చేసింది. మంగళవారం లక్షా 50వేలలోపు జిల్లా వ్యాప్తంగా రుణాలు తీసుకున్న 22వేల 868 మంది రైతులకు రుణాలు మాఫీ చేయనుంది. దీంతో జిల్లాలో ఇప్పటి వరకు 67వేల 337 మంది రైతులు రుణమాఫీ పొందారు. రుణాలు మాఫీ కానున్న రైతుల బ్యాంకు ఖాతాల్లో రుణమాఫీ డబ్బులను వేయనున్నారు. ఇప్పటికే లక్షలోపు రుణాలు మాఫీ పొందిన రైతుల ఖాతాల్లో బ్యాంకర్లు డబ్బులు జమ చేయగా మంగళవారం నుంచి లక్షా 50వేల లోపు రుణాలు పొందిన రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయనున్నారు. మొదటి విడతలో రుణమాఫీ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా రైతువేదికల్లో రైతులు సంబరాలు నిర్వహించారు. స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా రైతులతో మాట్లాడి వారి సంతోషాన్ని పంచుకున్నారు. మంగళవారం సైతం జిల్లా సమీకృత కలెక్టరేట్‌లో ఉదయం 11గంటలకు రెండవ విడత రుణమాఫీ పొందనున్న రైతులు, ప్రజాప్రతినిధులు, బ్యాంకర్లతో కార్యక్రమం నిర్వహించనున్నారు.



నిర్వహణకు నిధుల లేమి!

- పాఠశాలలు ప్రారంభమై 50 రోజులు గడుస్తున్నా విడుదల కాని నిధులు
- సొంత డబ్బులను పాఠశాలల నిర్వహణకు ఖర్చు పెడుతున్న హెచ్‌ఎంలు
- జిల్లా వ్యాప్తంగా 1221 ప్రభుత్వ పాఠశాలలు

నిజామాబాద్ అర్బన్, జూలై 29: ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ ప్రధానోపాధ్యాయులకు పెద్ద సవాలుగా మారింది. ప్రభుత్వ పాఠశాలల్లో నిధులు ఉంటేనే నిర్వహణ సక్రమంగా ఉంటుంది. పాఠశాలల్లో అవసరమైన వస్తువులు కొనుగోలు చేసేందుకు నిధులు అవసరం కాగా ఇప్పటికీ నిధులు విడుదల కాకపోవడంతో ప్రధానోపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఇప్పటికే ప్రభుత్వం నుంచి ఈ విద్యాసంవత్సరానికి సంబంధించి నిధులు విడుదల కావాల్సి ఉండగా ఇంకా విడుదల చేయలేదు. ప్రతీసంవత్సరం రెండు సార్లు నిర్వహణకు సంబంధించిన నిధులను ప్రభుత్వం విడుదల చేస్తుంది. పాఠశాలలు ప్రారంభమైన 15 రోజుల్లోపు మొదటి విడత నిధులు అక్టోబర్ తర్వాత రెండో విడత నిధులు విడుదల చేస్తుంది. కానీ 2024-25 విద్యాసంవత్సరానికి సంబంధించి పాఠశాలలు ప్రారంభమై సుమారు 50 రోజులు గడుస్తున్నా ఇంతవరకు నిధులు మంజూరు కాలేదు. జూలై మొదటి వారంలోనే నిధులు విడుదల చేయాల్సి ఉండగా ఇంకా నిధులు రాకపోవడంతో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సొంత డబ్బులు పాఠశాలల నిర్వహణ కోసం ఖర్చు పెడుతున్నారు. గత రెండు నెలలుగా పాఠశాలల నిర్వహణ బాధ్యతలు ప్రధానోపాధ్యాయులే నిర్వహిస్తుండగా నిధుల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొంది.

జిల్లాలో 1221 ప్రభుత్వ పాఠశాలలు..

జిల్లాలో 1221 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా లక్షా 30వేల వరకు విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్నారు. జిల్లాలో మండల పరిషత్, జిల్లా పరిషత్ పాఠశాలలు 673 ఉండగా, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు 112, ప్రాథమికోన్నత పాఠశాలలు 110, ఉన్నత పాఠశాలలు 230 ఉన్నాయి. తరగతి గదుల నిర్వహణకు విద్యార్థుల హాజరు రిజిస్టర్‌లు, కరెంటు బిల్లులు, తాగునీరు, చిన్న చిన్న మరమ్మతులు, చాక్పీస్‌లు, ప్రయోగశాలలకు అవసరమైన సామాగ్రి, పాఠశాలల్లో ఇతర అవసరాలకు నిధులు అవసరం ఉంది. అలాగే పరీక్షల నిర్వహణతో పాటు జాతీయ పండుగల నిర్వహణకు డబ్బులు అవసరం ఉంటుంది. పాఠశాలల నిర్వహణకు సంబంధించి ప్రతీసంవత్సరం వచ్చే నిధుల నుంచి పాఠశాలలకు అవసరమైన వస్తువులను, ఇతర సామాగ్రిని కొనుగోలు చేస్తారు. కానీ ఇంకా నిధులు విడుదల కాకపోవడంతో పాఠశాలలకు అవసరమైన వస్తువుల కొనుగోలు కష్టతరంగా మారుతుంది. గత ఏడాది మొదటి విడత నిధులు జూలై నెలలోనే విడుదల చేశారు. రెండవ విడత మాత్రం మార్చి నెలలో విడుదల చేశారు. ఈయేడాది మాత్రం ఇంకా నిధులు విడుదల కాకపోవడంతో ప్రధానోపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు.

విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా..

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ప్రభుత్వం నిధులు విడుదల చేస్తుంది. విద్యార్థుల సంఖ్య 1-30 వరకు ఉంటే రూ.10వేలు, 31-100లోపు ఉంటే రూ.25వేలు, 101-250 వరకు ఉంటే రూ.50వేలు, 251-1000 వరకు ఉంటే రూ.75వేల చొప్పున నిధులు సంవత్సరానికి విడుదల చేస్తుంది. వెయ్యి మందికంటే ఎక్కువగా ఉంటే రూ.లక్ష వరకు నిధులు వస్తాయి ఈ నిధులతో పాఠశాలల్లో చాలా అవసరాలను తీర్చే అవకాశం ఉంటుంది. గత 50 రోజులుగా నిధులు విడుదల కాక ఆయా పాఠశాలల్లో పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయులు తమ సొంత డబ్బులను వివిధ అవసరాల కోసం ఖర్చు చేస్తున్నారు. చాలా పాఠశాలలు ఛాక్పీసులు, రిజిస్టర్లు, తాగునీరు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిధులు విడుదల అయితే చాలా వరకు ఈ సమస్యలు పరిష్కారం అయ్యే అవకాశం ఉంది.

క్రీడా నిధులు రాక ఇబ్బందులు..

ప్రతీ పాఠశాలకు క్రీడల నిర్వహణకు నిధులు రావాల్సి ఉంది. ప్రభుత్వ పాఠశాలల్లో పీడీలు, పీఈటీలు ఉన్నా వివిధ రకాల ఆటలు ఆడించేందుకు పరికరాలు లేక ఆటలు ఆడించడం లేదు. వచ్చే ఆగస్టు 15న పాఠశాలల్లో క్రీడా పోటీలు నిర్వహించాల్సి ఉన్నా నిధుల లేమితో ఇబ్బందులను కలిగిస్తుంది. వచ్చే ఆగస్టు నుంచి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆటలు జరిగే అవకాశం ఉంది. వాటిలో పాల్గొనాలంటే పాఠశాలస్థాయిలో విద్యార్థులు పోటీలలో శిక్షణ పొందాల్సి ఉంటుంది. చాలా పాఠశాలల్లో గ్రామస్థులు, వివిధ సంఘాల వారు, ప్రజాప్రతినిధులు క్రీడా పరికరాలను అందిస్తూ ప్రోత్సహిస్తున్నారు. ప్రభుత్వం మాత్రం క్రీడా పరికరాలను ఇవ్వడం లేదు. కనీసం పాఠశాలల నిర్వహణ నిధులు ఇస్తే వాటి ద్వారా క్రీడా పరికరాలను కొనుగోలు చేసే అవకాశం ఉంది.

పాఠశాలల నిర్వహణ కష్టంగా ఉంటుంది..

: వెనిగళ్ల సురేష్, టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు



ప్రభుత్వ పాఠశాలల నిర్వహణకు ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులు ఇంకా రాలేదు. ప్రతియేడాది నిధులు ఆలస్యంగా విడుదల చేస్తున్నారు. దీనివల్ల పాఠశాల నిర్వహణ కష్టంగా మారుతుంది. పాఠశాలల్లో కనీస సౌకర్యాల నిర్వహణ ఇబ్బందికరంగా ఉంటుంది. తాగేందుకు మంచినీరు కూడా సరఫరా చేయలేని పరిస్థితి నెలకొంది. చిన్న చిన్న అవసరాలకు కూడా ప్రధానోపాధ్యాయులు ఖర్చు పెట్టే పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా ప్రభుత్వం నిధులు విడుదల చేయాలి.

త్వరలో విడుదలయ్యే అవకాశం..

: ఎస్.వి.దుర్గాప్రసాద్, డీఈవో



పాఠశాలల నిర్వహణకు సంబంధించి నిధులు త్వరలోనే విడుదలయ్యే అవకాశం ఉంది. ఇప్పటికే నిధులకు సంబంధించిన నివేదికను ఉన్నతాధికారులకు అందజేశాం. త్వరలోనే నిధులు విడుదలయ్యే అవకాశం ఉంది. ప్రధానోపాధ్యాయులు చొరవ చూపి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకుంటున్నారు.



● పొతంగల్‌లో దరఖాస్తుల ఏంట్రీని పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్



● కోటగిరి మండల పరిషత్ కార్యాలయంలో నిరీక్షిస్తున్న ప్రజాపాలన దరఖాస్తుదారులు

నమోదులో లోపం.. అర్హులకు శాపం!

- డాడా ఎంట్రీ ఆపరేటర్ల తప్పిదాలు
- దరఖాస్తుదారులకు తప్పని అవస్థలు
- ప్రజాపాలన దరఖాస్తుల్లో ఎడిట్ ఆప్షన్ కరువు
- గృహజ్యోతి, మహాలక్ష్మి అర్హులకు ఇబ్బందులు

కోటగిరి, జూలై 29: కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలు గృహజ్యోతి, మహాలక్ష్మి పథకాలు అర్హులందరికీ అందడం లేదు. దరఖాస్తులను ఆన్‌లైన్ చేసే క్రమంలో డేటా ఎంట్రీ ఆపరేటర్‌లు చేసిన దప్పిదాలు కొంత మంది అర్హుల పాలిట శాపంగా మారాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అన్ని అర్హతలు ఉన్నప్పటికీ జిల్లాలో 200యూనిట్‌ల లోపు విద్యుత్‌ను ఉచితంగా పొందే అవకాశంతో పాటు మహహాలక్ష్మి పథకం ద్వారా రూ.500లకే గ్యాస్ సిలిండర్‌ను పొందే అవకాశాన్ని చాలా మంది కోల్పోతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారంటీల పథకాల లబ్ధిదారుల ఎంపికకు ప్రజా పాలన కార్యక్రమాన్ని చేపట్టింది. గత ఏడాది డిసెంబర్ 28నుండి జనవరి 6వరకు గ్రామాలలో ప్రజా పాలన సభలు నిర్వహించి దరఖాస్తులు స్వీకరించింది. దరఖాస్తుపత్రాల్లో అవసరాల పథకాల లబ్ధికోసం టిక్ పెడితే చాలు అని చెప్పడంతో దరఖాస్తులు అదే పని చేశారు.

ఎడిట్ ఆప్షన్ లేక..

ప్రజాపాలనలో ప్రజలు అందించిన దరఖాస్తులను ఆన్‌లైన్ చేసే క్రమంలో తప్పులు దొర్లి అర్హత ఉన్న కొంతమందికి ప్రభుత్వ పథకాలు అందకుండా పోయాయి. దీంతో వాటిని సవరించేందుకు అవకాశం కల్పించారు. మండల పరిషత్ కార్యాలయాల్లో ప్రత్యేక కౌంటర్‌లు ఏర్పాటు చేసి సవరిస్తున్నారు. అయితే సవరణలో మాత్రం ఏటా ఏంట్రీ నమోదులో దొర్లిన కొన్ని పొరపాట్లను సవరించుకునేందుకు మాత్రమే అవకాశం ఉంది. నాట్ మ్యాచింగ్ ఆప్షన్ ఇచ్చిన వాటిని మాత్రమే సరి చేస్తున్నారు. నాట్ ఆప్లై అని ఉన్న వాటిని మాత్రం సరి చేసేందుకు ఎడిట్ ఆప్షన్ లేదు. ఈ సమస్యతో అర్హత కోల్పోయిన దరఖాస్తుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఈ సమస్యతో లబ్ధిపొందలేకపోయిన వారికి ఎడిట్ ఆప్షన్ ఇవ్వకపోవడంతో సిబ్బంది చేతులు ఎత్తేస్తున్నారు. ఎడిట్ ఆప్షన్ ఇస్తే తప్ప ఏమి చేయలేం అంటున్నారు. కేవలం మిస్ మ్యాచిడ్ అని ఉన్న వాటికి ఎడిట్ ఆప్షన్ ఉండడంతో వాటిని సరి చేస్తున్నారు. కొన్నింటికి మ్యాచిడ్ అంటే ఒక దరఖాస్తుదారుడి నెంబర్‌కు ఇంకొదారుడి నెంబర్ తప్పుగా నమోదు చేయడంతో అలాంటివి మ్యాచిడ్ అని కనిపిస్తుంది. కానీ ఇలా ఉన్న వాటిని కూడా సరి చేసేందుకు ఎడిట్ ఆప్షన్ తప్పనిసరి అంటున్నారు. ఎడిట్ ఆప్షన్ లేక తప్పులు సరి చేయకపోవడంతో సమస్య పరిష్కారం కోసం అర్హులందరు ఆఫీస్‌ల చుట్టూ తిరుగుతున్నారు.

తొందరపాటు వల్లే లోపాలు..

ప్రజాపాలన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో ఏంట్రీ చేసేందుకు ప్రైవేటు వ్యక్తులను నియమించి ఒక్కో దరఖాస్తుకు ఇంత అని చెప్పడంతో ఎక్కువ దరఖాస్తులు ఏంట్రీ చేసేందుకు పోటీ పడ్డ క్రమంలో అన్ని తప్పులు దొర్లినట్లుగా ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. దరఖాస్తులో గృహజ్యోతికి, మహలక్ష్మికి టిక్ మార్క్ చేసినా.. కొందరికి డేటా ఏంట్రీ ఆపరేటర్‌లు నాట్ ఆప్లై అని నమోదు చేశారు. దీంతో గృహజ్యోతి, మహలక్ష్మి పథకాలకు అర్హులైన వారికి అన్యాయం జరుగుతోంది. ప్రజాపాలన దరఖాస్తుల్లో దొర్లిన తప్పులను సవరించుకునేందుకు ఎడిట్ ఆప్షన్ ఇచ్చి అర్హులకు న్యాయం చేయాలని పలువురు కోరుతున్నారు.

కోటగిరి మండలంలో ఇదీ పరిస్థితి

కోటగిరి ఉమ్మడి మండలంలో ప్రజాపాలన కింద వేలాది దరఖాస్తులు వచ్చాయి. ప్రజాపాలన దరఖాస్తుల్లో సవరణ కోసం జూన్ 18నుంచి లబ్ధిదారులు మండల పరిషత్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. రోజుకు 30మందికి పైగా లబ్ధిదారులు కార్యాలయానికి వచ్చి తమ దరఖాస్తులను పరిశీలించి సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. మండల పరిషత్ కార్యాలయంలో నాట్ మ్యాచింగ్ ఆప్షన్ ఇచ్చిన వాటిని మాత్రమే అధికారులు సరి చేస్తున్నారు. నాట్ ఆప్లై అని ఉన్నవాటిని మాత్రం సరి చేసేందుకు ఎడిట్ ఆప్షన్ లేదని వివరిస్తున్నారు. దీంతో మండల పరిషత్‌కు వచ్చిన లబ్ధిదారులు నిరాశకు వెనుదిరుగుతున్నారు. ఇటీవల జిల్లా స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ అంకిత్ ప్రజాపాలన దరఖాస్తుల ఏంట్రీ తీరును పరిశీలించారు. సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. లబ్ధిదారుల వివరాలను ప్రత్యేకంగా రిజిస్టర్‌లో నమోదు చేయాలని పలు సూచనలు అందజేశారు.

ఎడిట్ ఆప్షన్ లేక ఇబ్బంది..

: మనోహర్ రెడ్డి, ఎంపీడీవో, కోటగిరి



ప్రజాపాలన దరఖాస్తుల్లో దొర్లిన తప్పులను సవరించేందుకు ఎడిట్ ఆప్షన్ ఇవ్వలేదు. ఈ ఆప్షన్ లేకపోవడంతో తప్పులు సరి చేయలేకపోతున్నాము. నాట్ ఆప్లై అని నమోదు చేయడంతో జీరో బిల్లుకు, మహాలక్ష్మికి అర్హులు కాలేకపోతున్నారు. సమస్య రాష్ట్ర వ్యాప్తంగా ఉంది. ఎడిట్ ఆప్షన్ వస్తేనే సరి చేసేందుకు వీలుంటుంది.









వర్నిలో దోమల నివారణకు చర్యలు

వర్ని,జూలై29: వర్ని మండల కేంద్రంలో సోమవారం దోమల నివారణ చర్యలు చేపట్టారు. సత్యనారాయణ పురం పంచాయతీ కార్యదర్శి సాయిలు, ఆపరేటర్ రవి ఆధ్వర్యంలో మిలాథిన్ పౌడర్‌ను మండల కేంద్రం వ్యాప్తంగా చల్లారు. అపరిశుభ్రత నివారణకు చర్యలు చేపట్టినట్లు కార్యదర్శి తెలిపారు.







న్యాయం చేయాలని జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు

ఎడపల్లి. జూలై29:మండలంలోని మంగల్‌పాడ్ గ్రామానికి చెం దిన రైతు మాల పెద్దులు తనకు లక్షలోపు పంట రుణం ఉన్నా మాఫీ కాలేదని, తనకు న్యాయం చేయాలని కోరుతూ సోమవారం మానవ హక్కుల క మిషన్‌కు, జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో రైతుమాట్లాడుతూ తన పేరిట మరియు తన భార్య మాలగంగామణి పేరిట ఎడపల్లి మండలంలోని ఎడపల్లి, మంగల్‌పాడ్ రెవెన్యూ శివారులో కలిపి ఉన్న ఎకరం 24 గుంటల భూమిపై ఎడపల్లి మండల కేంద్రంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకు, ఎడపల్లి ప్రాథమిక సహకార సంఘం, కెనరాబ్యాంకు మంగల్‌పాడు బ్రాంచి నందు అన్నీ కలిపి రూ.98040 పంట రుణం తీసుకున్నామని, ప్రభుత్వం ప్రకటించిన లక్షలోపు రుణం తమ కుటుంబానికి మాఫీ కాక పోవడంతో మండల వ్యవసాయ అధికారి సిద్ది రామేశ్వర్‌ను సంప్రదించి వివరణ కోరగా తను తీసుకున్న రూ.98040 పంట రుణంతోపాటు, అదనంగా రూ.లక్షా ఇరవైవేల కుర్నాపల్లి గ్రామానికి చెందిన ఘటక చిన్నసాయులు ఎడపల్లి ప్రాథమికసహకార సంఘంలో నీయొక్క ఖాత పైరుణం తీసుకున్నట్లు ఉన్నదని ఆయన తెలిపారు.నాఆధార్ కార్డు, పట్టాబుక్కు ఉపయోగించినాఖాతాపై ఇంకొకరు ఎలారుణం పొందుతారు అని సహకార సంఘం కార్యదర్శిని నిలదీయగా టెక్నికల్ సమస్య అని చెబుతూ తప్పించుకుంటున్నాడని ఆయన అన్నారు.మానవ హక్కుల కమిషన్‌కు మరియు జాతీయఎస్సీఎస్టీ కమీషన్‌కు స్పీడు పోస్టుద్వారా ఫిర్యాదు చేశారని తెలిపారు.





'పొలం బాట'లో బీటెక్ విద్యార్థినులు



ఖిల్లా డిచ్‌పల్లిలో మహిళ రైతులతో బీటెక్ విద్యార్థినులు

డిచ్‌పల్లి,జూలై 29: హైదరాబాద్ మల్లారెడ్డి కళాశాలకు చెందిన బీటెక్ విద్యార్థినులు సో మవారం ఖిల్లా డిచ్‌పల్లి, దూస్‌గాం శివారులో పొలంబాట పట్టి వరినాట్లు వేశారు. పలు చోట్ల కలుపు సైతం తీశారు.మహిళలతో కలిసి నాట్లు వేయడం ఎంతో ఆనందం కల్గిందని విద్యార్థినులు తెలిపారు.

బాధితుడికి ఎల్‌వోసీ అందజేత

కమ్మర్‌పల్లి, జూలై29: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కొనసముందర్ గ్రామానికి చెందిన ఎం.జయంత్‌కు వైద్యఖర్చుల నిమిత్తం రూ.2లక్షల 50వేల ఎల్‌వోసీని సోమవారం అందజేశారు.మెరుగైన చికిత్సకు భారీ ఖర్చు అవుతుండడంతో బాధితుడి కుటుంబసభ్యులు బాల్కొండ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ సునీల్‌కుమార్‌ను ఆయన సీఎం సహాయ నిధి నుంచి చికిత్స నిమిత్తం ఎల్‌వోసీని మంజూరు చేయించి కుటుంబసభ్యులకు అందజేశారు. అపద సమయంలో ఆదుకున్న సునీల్‌కుమార్‌కు బాధితులు కృతజ్ఞతలు తెలి పారు.

ఆలయానికి సౌండ్ సిస్టం వితరణ

ఆర్మూర్‌టౌన్,జూలై29: పట్టణంలోని రాంనగర్‌లోని రామాలయానికి రోటరీ క్లబ్ అధ్యక్షుడు రజనీష్‌కిరాడ్ సౌండ్‌సిస్టంను అందజేశారు. ఆలయంలో సౌండ్ సిస్టం చెడిపోవడంతో ఆలయ కమిటీ సభ్యుల అభ్యర్థన మేరకు సుమారు రూ.4వేల విలువ గల సౌండ్ సిస్టంట్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజరి వెంకటరమణచారి, ఆలయ కమిటీ ఛైర్మన్ కొక్కుల లింగం, రోటరీ క్లబ్ సభ్యులు రాస ఆనంద్, పిట్ల శశిధర్, పుష్పకర్‌రావు, ప్రవీన్‌పవార్, తదితరులు పాల్గొన్నారు.

'దాడి చేయించిన వారిని అరెస్టు చేయాలి'

ఆర్మూర్‌టౌన్ , జూలై29: నందిపేట మండలం తల్వేద గ్రామంలో పెద్ద పెద్దన్నపై దాడి చేయించిన సాయిరెడ్డిని అరెస్టు చేయాలని సీపీఐ, సీపీఎం, ఐఎఫ్‌టీయూ, ఆల్‌ఇండియా అంబేద్కర్ యువజన సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ రెండేళ్ల క్రితం దళితుడైన పెద్ద పెద్దన్నపై దాడి చేయించి భూమిని కబ్జా చేయాలని ప్రయత్నించారని అప్పుడు దాడికి పాల్పడ్డ వారిపై, దాడి చేయించిన వారిపై ఫిర్యాదు చేశామని, అందులో కొందరిని అరెస్టు చేసి సాయిరెడ్డిని ఇప్పటి వరకు అరెస్టు చేయకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఇప్పటికైనా అరెస్టు చేయకపోతే జిల్లా కేంద్రంలో ఉద్యమం చేపడతామని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ, సీపీఎం డివిజన్ కార్యదర్శి దాసు, పల్లవు వెంకటేష్, ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శివాజీ, ఆల్‌ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు మూగ ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.





పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

బోధన్‌రూరల్,జూలై29: బోధన్ మండలంలోని పెంటాఖుర్దు ప్రభుత్వ పాఠశాలలో సోమవారం 1994-95 సంవత్సరానికి చెందిన 10వ తరగతి విద్యార్థులు అదే పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 30సంవత్సరాల కలిసిన పూర్వ విద్యార్థులు ఒకరినొకరు పరిచయం చేసుకుని తమ పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు, చిన్ననాటి తీపి గుర్తులను పంచుకున్నారు. వివిధ హోదాలలో ప్రభుత్వ సంస్థల్లో స్థిరపడ్డారని ఒకరినొకరు చెప్పుకొచ్చారు. ఈ కార్యక్రమంలో గురువులు, రిటైర్డ్ ఎంఈవో శాంతకుమారి, వీరయ్య, త్రిపుర, హెడ్‌మాస్టర్ రత్నాకర్, పూర్వ విద్యార్థులు సాయిలు, దత్తాత్రి, ప్రభాకర్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కిసాన్‌నగర్‌లో వాహనాల తనిఖీ



కిసాన్‌నగర్‌లో వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్సై

ముప్కాల్, జూలై29: బాల్కొండ మండలంలోని కిసాన్‌నగర్ గ్రామంలో సోమవారం స్థానిక ఎస్సై యాసిర్‌హర్ఫిత్ వాహనాలను తనిఖీ చేశారు. సరైన ధ్రువపత్రాలు లేని, లైసెన్స్‌లు వాహనాలు, నెంబర్‌ప్లేట్ లేకుండా రోడ్డుపై నడిపిస్తున్న వాహనాలను సీజ్ చేసినట్టు ఆయన తెలిపారు. ద్విచక్ర వాహనాలు నడిపేవారు హెల్మెట్ ధరించాలని, వాహనాలను విధిం చిన చానల్‌ను తప్పకుండా చెల్లించాలన్నారు. మైనర్‌లకు వాహనాలు ఇవ్వ వద్దని మైనర్‌లు వాహనాలు నడపవద్దని అన్నారు. ఈ తనిఖీలో హెచ్ కానిస్టేబుల్ జయవంతరావు, కానిస్టేబుళ్లు సదానంద్, సాయికుమార్, పాల్గొన్నారు.

అక్రమంగా విక్రయిస్తున్న గుట్కా ప్యాకెట్ల పట్టివేత



గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్న పోలీసులు

నవీపేట,జూలై29: మండల కేంద్రంలోని కిరాణ దుకాణాలలో అక్రమంగా విక్రయిస్తున్న గుట్కా ప్యాకెట్లను సోమవారం పట్టుకోవడం జరిగిందని ఎస్‌ఐ యాదగిరి గౌడ్ తెలిపారు. కొండ కార్తీక్ కిరాణ దుకాణంలో రూ.2,700 విలువైన గుట్కా ప్యాకెట్‌లు, దోండి వినోద్ కిరాణ దుకాణంలో రూ.4800 విలువైన గుట్కా ప్యాకెట్లను పట్టుకోవడం జరిగిందని ఎస్‌ఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వివరించారు. అక్రమంగా గుట్కా, ఇతర మత్తు పదార్థాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

నిషేధంపై నిర్లక్ష్యం ఎలా ?



పారేసిన నిషేధిత గుట్కా సంచులు

ఎడపల్లి, జూలై29: రాష్ట్ర ప్రజల ఆరోగ్య రక్షణ కోసం ప్రభుత్వం గుట్కాలను, తంబాకు లాంటి మత్తు పదార్థాలను నిషేధించింది. దీంతో రాష్ట్రంలో విచ్చల విడిగా అమ్మిన గుట్కాలు, తంబాకు వంటి మత్తుపదార్థాలను కొందరు దొంగ చాటుగా రవాణా చేస్తూ పలు పాన్ షాపులలో, కిరాణా షాపులకు సరఫరా చేస్తున్నారు. ఇదిలా ఉండగా ఎడపల్లి మండలంలోని జానకంపేట గ్రామ శివారులోని బోధన్-నిజామాబాద్ ప్రధాన రహదారిపై ఉన్న దర్గా దగ్గర పదుల సంఖ్యలో సంచులలో నిషేధిత గుట్కాలు దర్శనమిచ్చాయి. ఇవి దాదాపు రూ.50 వేల వరకు విలువ ఉంటాయని, ఇవి అక్కడ ఎవరు పడవేశారో, ఎందుకు పడవేశారో అని అక్కడికి వచ్చిన ప్రజలు గుసగుస లాడుతున్నారు. తనిఖీలో పట్టుబడినవా? లేక పట్టుబడిన తరువాత అధికారులే ఇక్కడ పారవేశారో తెలియాల్సి ఉంది. స్థానికులు ఈవిషయంపై 6వ టౌన్ పోలీసులకు సమాచారం అందించారు.

మంగల్‌పాడ్‌లో యువతి అదృశ్యం



పూజ(ఫైల్)

ఎడపల్లి, జూలై29:ఎడపల్లి మండలంలోని మంగల్‌పాడ్ గ్రామానికి చెందిన యువతి అదృశ్యమైనట్లు ఎడపల్లి ఎస్సై వంశీ కృష్ణారెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఎడపల్లి మండలం మంగల్‌పాడ్ గ్రామానికి చెందిన బరడిరాధ, పోశెట్టి దంపతుల కూతురుపూజ (21)గత నెల 24వ తేదీ న మగ్గం వర్క్‌కు సంబంధించిన వస్తువులు తీసు కువస్తానని చెప్పి నిజామాబాద్‌కు వెళ్లి తిరిగి రాకపోవడంతో,బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీలభిం చకపోవడంతో ఆదివారం రాత్రి స్టేషన్‌కు వచ్చి యువతి తల్లి బరడి రాధ ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

లక్కోర రోడ్డుపై నీటి గుంతలు



లక్కోరలో రోడ్డుపై ప్రమాదకరంగా మారిన నీటి గుంత

వేల్పూర్, జూలై29: మండల గ్రామమైన లక్కోరలో ప్రభుత్వ పాఠశాల సమీపంలోని వెనుక భాగంలో రోడ్డుపై ఏర్పడిన నీటి గుంత ప్రమాద కరంగా మారింది. ఈ రోడ్డును సీసీరోడ్డుగా నిర్మించిన సమయంలో నాణ్యత లేకుండా లెవల్ సరిగ్గా చేయకుండా నిర్మించడం వల్ల రోడ్డు లోతుకు కుంగిపోయి పెద్ద గుంతగా ఏర్పడింది. గతవారం రోజులుగా కురుస్తున్న వర్షం నీరంతా లోతు గుంతలో చేరి నిలిచిపోయాయి. దీంతో ఆరోడ్డు గుండా వెళ్లాలంటే ప్రజలు, వాహనదారులకు ఇబ్బంది మారింది. ఇటీవల ఓ చిన్నారి ఆడుకుంటూ వెళ్లి ఆ నీటి గుంతలో పడిపోయింది. అక్కడే ఉన్న కొందరు ఆ చిన్నారిని నీటి గుంత నుంచి బయటకు తీశారు. ఆపాటికే ఆ చిన్నారి కొంత వరకు బురదనీరు మింగడంతో డాక్టర్ వద్దకు తీసుకువెళ్ళి చికిత్స చేయించడంతో ప్రాణపాయం నుంచి బయటపడిందని స్థానికులు తెలిపారు. ఈ నీటి గుంత నుంచే నిత్యం విద్యార్థులు పాఠశాలకు వెళ్తూ వస్తుంటారు. ఇప్పటికైనా గ్రామపంచాయతీ అధికారులు ప్రమాదకరంగా మారిన నీటి గుంతను మరమ్మతులు చేపట్టి నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలని, పరిసరాల కుటుంబీకులు కోరుతున్నారు.

గుంతలమయమంగా సిరికొండ- చిన్నవాల్గోట్ రోడ్డు



గుంతలుగా మారిన రోడ్డు

- రోడ్డు బాగులేక గాయాల పాలైన విద్యార్థులు
- పట్టించుకోని అధికారులు
- ఇబ్బందుల్లో వాహనదారులు

సిరికొండ జూలై 29:సిరికొండ - చిన్నవాల్గోట్ రోడ్డు తారురోడ్డు ధ్వంసమై అధ్వాన్నంగా మారి ప్రయాణికుల పాలిట ప్రమాదకరంగా మారింది. దశాబ్దం క్రితం నిర్మించిన రోడ్డు పాడైపోయిన మరమ్మతు పనులు చేయకపోవడం వల్ల అధ్వాన్నంగా మారింది. ఇందకు ఈ రోడ్డు బాగయ్యేదెన్నడు అన్ని రెండు గ్రామాల ప్రజలు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. పదిహేనేళ్ల క్రితం అనాటి కాంగ్రెస్ ప్రభుత్వం సిరికొండ - చిన్నవాల్గోట్ మధ్యలో గల మూడు కిలోమీటర్ల నిడివి గల ఈ రోడ్డు తారు రోడ్డుగా మార్చింది. రోడ్డుపై కేజీవీల్స్ ట్రాక్టర్‌లు తిరుగడం వల్ల రోడ్డంతా ధ్వంసమై గుంతలుగా మారింది. రోడ్డుమరమ్మతు కోసం గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేవలం రూ.60 లక్షలు మంజూరు చేసింది.అధికారులు టెండర్లు పూర్తి చేసిన కాంట్రాక్టర్ నిధులు వస్తాయోరావో అనే దానితో పనులు చేయకుండా వదిలేశారు. గత ఎన్నికల కంటే ముందు తిరిగి టెండరు పిలిచిన కాంట్రాక్టర్ ముందుకు రాకపోవడం పనులు జరుగలేదు.పెద్దవాల్గోట్, పోతన్నూర్,చిన్నవాల్గోట్ గ్రామాల నుంచి మండల కేంద్రానికి ప్రజలు రోజు ప్రయాణిస్తారు. మోడల్ స్కూల్‌కు ఈగ్రామాలలకు చెందిన విద్యార్థులు సైకిళ్లపై వస్తారు. ఈ రోడ్డున ప్రయాణించే ప్రయాణికులు, విద్యార్థులు స్కిడ్ అయి పడితే దెబ్బలు తగిలిన సందర్భాలు అనేకం ఉన్నాయి. ప్రభుత్వం ప్రయాణికుల భద్రతనుదృష్టిలో పెట్టుకుని రోడ్డు మరమ్మతుకు నిధులు మంజూరు చేయించి బాగు చేయించాలని విద్యార్థుల తల్లిదండ్రులు, మూడు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

నిధులు రాగానే పనుల ప్రారంభిస్తాం

చిన్నవాల్గోట్ - సిరికొండ రోడ్డు మరమ్మతుకు కొత్తగా ప్రతిపాదనలు తయారు చేసి పంపిస్తున్నామని పంచాయతీ రాజ్ ఏఈ ఆహ్మద్ హుస్సేన్ తెలిపారు. గతంలో మంజూరైన రూ.60 లక్షలు సరిపోవడం లేదని కొత్తగా ప్రతిపాదనలు పంపిస్తున్నట్లు ఆయన తెలిపారు.నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభిస్తామని ఏఈ చెప్పారు.

- ఆహ్మద్ హుస్సేన్,పంచాయతీరాజ్ ఏఈ

ప్రమాదకరంగా మారిన రహదారి

- గుంతలతో వాహనదారుల అవస్థలు



కోటగిరి-ఎక్లాస్‌పూర్‌లో రహదారిపై ఏర్పడ్డ గుంతలో వర్షపు నీరు

కోటగిరి,జూలై29: కోటగిరి-ఎక్లాస్‌పూర్ అధ్వానంగా మారింది. కోటగిరి నుండి ఎక్లాస్‌పూర్ వెళ్లే రహదారి చిన్నపాటి వర్షాలలకు రహదారిపై ఏర్పడిన గుంతల్లో వర్షం నీరు నిలుస్తుంది. మోకాలి లోతు గుంతలు పడి వర్షపు నీరు నిలవడంతో ప్రయాణం ప్రమాదకరంగా మారింది. ఈ రహదారిలో ఎక్లాస్‌పూర్, కొత్తపల్లి, సుద్దులం, అడ్కాస్‌పల్లి, లింగాపూర్‌తో పాటు ఆయా గ్రామాల ప్రజలు ప్రయాణిస్తుంటారు. వందలాది మంది మండల కేంద్రానికి వచ్చి వెళ్తుంటారు. మండల కేంద్రంలోని సుమారు 400మీటర్ల రహదారి అధ్వానంగా తయారైంది. వర్షం పడిదంటే రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. వాహనాలు వెళ్లే క్రమంలో బురదనీరు పక్క నుంచి వెళ్లే వారిపై పడుతోంది. 400మీటర్ల రహదారి నిర్మాణానికి నిధులు మంజూరైన పనులు చేపట్టకపోవడంపై తీవ్ర నిరసన వ్యక్తమవుతుంది. రోడ్డుకు ఇరువైపులా మురికి కాలువలు నిర్మించి చేతులు దులుపుకున్నారు. రహదారిపై కనీస మరమ్మతులు చేపట్టకపోవడంపై ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గుంతల్లో నీరు నిల్వకుండా మొరం వేసి రహదారి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

విద్య నిగూఢమైన ధనం

- విద్యార్థులు తల్లిదండ్రుల ఆశయాలు నెరవేర్చాలి: బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వర్ రావు



హాజరైన పట్టణ ప్రముఖులు, విద్యార్థుల తల్లిదండ్రులు



విద్యార్థులకు ప్రవచనాలు చేస్తున్న చాగంటి



చాగంటి కోటేశ్వర్ రావును కలిసిన ప్రముఖులు

బోధన్‌రూరల్,జూలై29: విద్య నిగూఢమైన ధనమని నేటితరం విద్యార్థులు తమ తల్లిదండ్రుల ఆశయ సాధనకు కృషి చేయాలని బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వర్‌రావు అన్నారు. సోమవారం బోధన్ పట్టణంలోని విజయసాయి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు చాగంటి కోటేశ్వర్‌రావు విలువలతో కూడిన విద్య అనే అంశంపై నిర్వహించిన సమావేశంలో ప్రసంగించారు.జ్యోతి ప్రజ్వలన అనంతరం చిన్నారులు చేపట్టిన కూచిపూడి నృత్యాలు అందరిని ఆకట్టుకున్నాయి. విద్యార్థులు తమ జీవితంలో వచ్చే కష్టాలకు భయపడవద్దని, ఎన్ని కష్టాలు వచ్చిన వాటిని ఎదుర్కొని పోరాడి గెలవాలని ఆయన విద్యార్థులకు సూచించారు. విద్య కంటికి కనబడని ఆభరణం అని విద్య యొక్క ప్రాముఖ్యతను వివరించారు. తల్లిదండ్రులు తమ పిల్లల ఉజ్వల భవిష్యత్ కోసం అనేక కష్టాలను ఓర్చుకుని ఒడిదుడుకులకులోనై పిల్లల బాగు కోసం కృషి చేస్తారని అలాగే విద్యార్థులు కూడా ఉన్నత స్థానాలకు చేరుకుని తమ తల్లిదండ్రుల రుణం తీర్చుకోవాలన్నారు. మనిషి జీవితంలో విద్యతోనే సమగ్ర అభివృద్ధి జరుగుతుందని, విద్య ప్రాముఖ్యతను తెలియజేశారు. చాగంటి కోటేశ్వర్‌రావు ప్రవచనాలను ప్రజలు ఆసక్తిగా తిలకించారు. ఈకార్యక్రమంలో బోధన్ మున్సిపల్ చైర్మన్ తూము పద్మశరత్‌రెడ్డి, బోధన్ ఏసీపీ శ్రీనివాస్‌లతో పట్టణ ప్రముఖులు, వేద పండితులు ప్రవీణ్ మహరాజ్, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టాలి



బోధన్‌లో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

బోధన్‌రూరల్,జూలై29: పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ రిజర్వేషన్‌ల వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు డల్లా సురేష్ మాదిగ అన్నారు. సోమవారం బోధన్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఎస్సీ వర్గీకరణ సాధనకై హలో మాదిగ. చలో ఢిల్లీ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ రిజర్వేషన్‌ల సాధనకై ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు బీఎన్.రమేష్ మాదిగ నాయకత్వంలో ఆగస్టు 10,11వ తేదీలలో ఢిల్లీ కేంద్రంగా జంతర్ మంతర్ వద్ద మహధర్నా కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఈ కార్యక్రమంలో బోధన్ నియోజకవర్గ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. తెలంగాణ అసెంబ్లీలో తీర్మానం అయినటువంటి ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణపై సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో అఖిలపక్షం బృందాన్ని తీసుకెళ్లాలని మాదిగ సమాజం తరపున కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు కే.గంగాధర్, పానుగంటి సాయిలు, బాషల సాయిలు, బాబు మాదిగ, కుమ్మన్‌పల్లి నర్సింహులు, సాయన్న, మల్లికార్జున్, కొండ్ర అజయ్, మారుతీ, వడ్డేపల్లి శేఖర్, పోశెట్టి తదితరులున్నారు.

టీయూ గ్రంథాలయానికి బీటలు



టీయూ గ్రంథాలయంలో బీటలు వారిన గోడలు

డిచ్‌పల్లి,జూలై 29: తెలంగాణ విశ్వవిద్యాలయంలోని సెంట్రల్ లైబ్రేరీ భవనం నిర్మించిన పదేళ్ల కాలంలోనే అన్ని గదుల్లో బీటలు వారాయి. 2014 జూన్ 27న ప్రారంభించిన వర్సిటీ సెంట్రల్ లైబ్రేరీ పనులు కాంట్రాక్టర్ హడవిడిగా చేయడం నాణ్యత లోపం పదేళ్లకాలంలోనే గోడలు బీటలు వారాయి. ఇటీవల విద్యుత్ స్విచ్‌బోర్డులలో కూడా మంటలు చెలరేగిన విషయం తెలిసిందే. అధికారుల నిర్లక్ష్యం కాంట్రాక్టర్ అలక్ష్యం కారణంగా భవన నిర్మాణ పనులు నాణ్యతకు తూట్లు, దాచేందుకు పాట్లు అనే చందంగా తయరైంది. విద్యార్థులు చదువుకునే సమయంలో ఏ ఉపద్రవం వస్తుందోనని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు వెంటనే బీటలు వారిన ప్రాంతాల్లో మరమ్మతులు చేప ట్టాలని విద్యార్థులు కోరుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో రూ.4కోట్లలతో నిర్మించిన సెంట్రల్ లైబ్రేరీ పనులు తక్షణమే మరమ్మతులు చేసేల అధికారులు చర్యలు తీసుకోవాలని విద్యార్థులు కోరు తున్నారు.

ఆయిల్ పామ్ సాగుతో లాభాలు



ఆయిల్ పామ్ మొక్కలు నాటుతున్న అధికారులు

ఏర్గట్ల,జూలై 28: ఆయిల్ పామ్ సాగుతో లాభాలు పొందవచ్చిని ఉద్యానవన అధికారి రుద్ర వినాయక్ తెలిపారు. వరికి ప్రత్యామ్నాయంగా రైతులను ఆయిల్ పామ్ సాగువైపు మళ్లించేందుకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. సోమవారం మండలంలోని బట్టాపూర్ గ్రామంలో కట్కం సామంత్‌కు సంబంధించి ఆరుఎకరాల్లో ఆయిల్ పామ్ మొక్కలను నాటే కార్యక్రమాన్ని ఉద్యానవన అధికారి రుద్రవినాయక్,ప్రీ యూనియన్ కంపెనీ మండల ఆయిల్ పామ్ అధికారి ప్రేమ్‌సింగ్ ప్రారంభించారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా ఉద్యానవన శాఖ అలాగే ప్రీయూనియన్ అయిల్ పామ్ కంపెనీ వారు సంయుక్తంగా మెగా ప్లాంటేషన్ డ్రైవ్ నిర్వహించామని తెలిపారు.ఈకార్యక్రమంలో గ్రామంలోని రైతులు పాల్గొన్నారు.

పంట నష్టాన్ని పరిశీలిస్తున్న అధికారులు



మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి

ఆర్మూర్‌టౌన్,జూలై29:మండలంలోని ఇస్సాపల్లి గ్రామశివారులో మొక్క జొన్న పంట నష్టాన్ని సోమవారం వ్యవసాయాధికారి హరికృష్ణ పరిశీలిం చారు. ఇటీవల అడవి పందుల మొక్కజొన్న పంట దాడి చేసి సుమారు ఎకరం వరకుపంట ధ్వంసం చేయగా సుమారు రూ.లక్ష20 వేల వరకు నష్టం వాటిల్లినట్టు రైతు నూతుల శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఆర్థికంగా నష్టపోయిన తనను ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన కోరారు.

వైద్యశాఖలో ముగ్గురు అధికారుల బదిలీ

కోటగిరి,జూలై29: కోటగిరి మండలంలో వైద్యశాఖలో పని చేస్తున్న ముగ్గురు అధికారులు బదిలీ అయ్యారు. సాధారణ బదిలీలలో భాగంగా మండల ఆరోగ్య విస్తరణ అధికారి గోవర్ధన్ కోటగిరి నుండి నిజామాబాద్ డిప్యూటీ డీఎంహెచ్‌వో కార్యాలయానికి బదిలీ అయ్యారు. సూపర్‌వైజర్ జ్యోతి వర్నికి బదిలీ కాగా మరో సూపర్‌వైజర్ సాలూరకు బదిలీ అయ్యారు.

రైల్వే వంతెన కింద నిలిచిన వర్షపు నీరు

- వాహన చోదకులకు తప్పని తిప్పలు



రైల్వే వంతెన కింద నిలిచిన వర్షం నీరు

డిచ్‌పల్లి,జూలై29: మండలంలోని నాగా పూర్ జాతీయ రహదారి చేరువలో రైల్వే అండర్ బ్రిడ్జి వర్షం నీరు నిలబడటంతో వాహనచోదకులు తీవ్రఇక్కట్లు పడుతున్నారు. రైల్వే అధికారులకు ఎన్నిసార్లు విన్నవించిన పట్టించుకోవడం లేదని వెంటనే నిలిచిన నీటిని తొలగించేలా చర్యలు తీసుకో వాలని కోరు తున్నారు.

మోటార్ సైకిల్ అపహరణ

డిచ్‌పల్లి,జూలై29: డిచ్‌పల్లి రైల్వే స్టేషన్ ప్రాంతంలో ఎంపీడీవో కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేసే కృష్ణకు చెందిన మోటార్ సైకిల్ గుర్తు తెలియని వ్యక్తులు అలహరించారని బాధితుడు కృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. రైల్వేస్టేషన్ వద్ద హీరో గ్లామర్ బైకును దొంగలు అపహరించినట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అదృశ్యమైన విద్యార్థి ఆచూకీ లభ్యం

నవీపేట,జూలై29: మండలంలోని మోకన్‌పల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని అంజుమాన్‌ఫారంకు చెందిన కోడూరి అశోక్ అనే విద్యార్థి ఆచూకీ లభ్యమైందని ఎస్‌ఐ యాదగిరి గౌడ్ తెలిపారు. ఈ నెల 27న అశోక్ అనే పదో తరగతి విద్యార్థి అదృశ్యం అయిన విషయం విదితమే. మండల కేంద్రంలోని జడ్పీహెచ్‌ఎస్ బాలుర పాఠశాలలో పదో తరగతి చదువుతున్న అశోక్ శనివారం పాఠశాల అనంతరం హైదరాబాద్‌లో ఉన్న తన స్నేహితుల వద్దకు వెళ్లాడని ఆయన పేర్కొన్నారు.

పాఠశాలలో శిక్షా సప్తాహ కార్యక్రమం

మోస్రా,జూలై29: మండల కేంద్రంలోని జడ్పీహెచ్‌ఎస్ మోస్రా పాఠశాలలో గత ఆరు రోజులుగా ప్రభుత్వ ఆదేశాల అనుసారం పాఠశాలలో శిక్షా సప్తాహ అనే ఒక విద్యా కార్యక్రమం నేడు చివరి రోజు సందర్భంగా పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులకు తెలియజేయునది. నేడు సప్తా కార్యక్రమం చివరి రోజు సందర్భంగా హెచ్‌ఎం బాలాజీ మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో భాగంగా తిథి భోజన కార్యక్రమం కలదు. కావున మోస్రా గ్రామ పెద్దలకు, వివిధ యువజన సంఘాల యువకులకు, మహిళా స్వయం సహాయక సంఘం సభ్యులకు అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ మరియు సభ్యులకు మరియు విద్యార్థి, విద్యార్థుల తల్లిదండ్రులకు తెలియజేయునది ఏమనగా మీరందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పీహెచ్‌ఎస్ మోస్రా,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

29మంది పేకాట రాయుళ్ల అరెస్టు

ఆర్మూర్‌టౌన్,జూలై29: మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లిలో ఆదివారం రాత్రి సీసీఎస్ పోలీసులు పేకాట రాయుళ్ళను అరెస్టు చేసి ఆర్మూర్ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. పక్క సమాచారం మేరకు పేకాట ఆడుతున్న 29మందిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.లక్ష 37వేల నగదు, పది కార్లు, ఒక స్కూటి, 24సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్టు ఎస్సై అంజమ్మ తెలిపారు.

సైబర్ నేరాల మోసాలకు ప్రజలు బలి కావద్దు



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సై

మోపాల్, జూలై 29: సైబర్ నేరగాళ్లు ప్రజలను మోసం చేయడానికి ఫోన్‌కాల్ చేస్తూ మాయమాటలు చెప్పి ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని, వారి మాటలు నమ్మి ఎవరూ మోసపోవద్దని మోపాల్ ఎస్ఐ గంగాధర్ అన్నారు. పోలీసు స్టేషన్ పరిధిలోని సింగన్‌పల్లి, చిన్నాపూర్ గ్రామాల్లో నివసిస్తున్న ఒకరిద్దరికి సైబర్ నేరగాళ్లు ఫోన్ చేసి మోసం చేయడానికి ప్రయత్నించారని సింగంపల్లి గ్రామానికి చెందిన భూమేష్ సోమవారం ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఆదివారం రాత్రి గుర్తు తెలియని సైబర్ నేరగాళ్లు ఫోన్ చేసి మేము సీబీఐ కార్యాలయం నుంచి మాట్లాడుతున్నామని మీ మేనకోడలు మాదకద్రవ్యాల కేసులో ఇరుక్కుందని ఆమెను ఈ కేసు నుంచి తప్పించాలంటే రూ.50వేలు తనకు తాను చెప్పిన విధంగా పంపించాలని లేదంటే మేనకోడల్ని చంపివేస్తామని బెదిరించారని బాధితుడు పోలీసులకు వివరించినట్లు తెలిపారు. వెంటనే బాధితుడు వాస్తవాలను తెలుసుకోవడానికి మేనకోడల్ని ఫోన్ చేసి అడుగగా తాను ఇంటి వద్దనే ఉన్నానని చెప్పడంతో బాధితుడు ఊపిరి పీల్చుకున్నాడు. ఈ విషయాన్ని వెంటనే పోలీసులకు సమాచారం అందజేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ సంఘటనకు రెడు రోజుల ముందూ చిన్నపూర్ గ్రామానికి చెందిన ఓ వ్యక్తిని మోసం చేయడానికిసైబర్‌నేరగాళ్లు ఫోన్ చేశారని ఎస్ఐ వివరించారు. ప్రజలు ఈ విషయంలో అప్రమత్తంగా ఉండాలని కోరారు. సైబర్‌నేరగాళ్ల ఫోన్ వచ్చినప్పుడు డయల్ 100కు, 1930లకు కాల్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

ధర్పల్లి: సైబర్ నేరాలపై మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై విక్రమ్ సూచించారు. సోమవారం పోలీస్ స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ సైబర్ నేరాలపై మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. నేరాలపై ఇప్పటికే గ్రామాల్లో, పాఠశాలల్లో విస్తృతంగా కళాజాతా ద్వారా అవగాహన కల్పించామన్నారు. గుర్తుతెలియని వ్యక్తులు వాట్సాప్‌కాల్ చేసి న్యూడ్ ఫోటోలు పంపి చాటింగ్ చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. జిల్లా పోలీస్ అధికారి డీపీ పెట్టుకొని ఫోన్ చేసి డబ్బులు పంపాలంటూ బ్లాక్‌మెయిల్ చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వీడియోకాల్స్, మెస్సేజ్‌లు, ఫోన్‌లు వస్తే స్పందించవద్దన్నారు. ఎలాంటి అనుమానాలు ఉన్నా పోలీస్ స్టేషన్‌లో తెలియజేయాలని ఆయన చెప్పారు.



యోగా చేస్తున్న దృశ్యం

దయానంద యోగా కేంద్రంలో ఘనంగా గురుపూజోత్సవం

సుభాష్‌నగర్, జూలై 29: దయానంద యోగా కేంద్రంలో సోమవారం గురుపూజోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. నగరంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌లో జ్యోతిప్రజ్వలన చేసి యోగా గురువు రాఘవ దీక్షితులు విగ్రహానికి పూలమాల వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ మున్సిపల్ చైర్మన్ దేవేందర్‌గుప్త హాజరై మాట్లాడారు. ప్రతి ఒక్కరు యోగా సాధన చేసి ఆరోగ్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ఉందని అన్నారు. విద్యార్థులకు, యువతకు యోగా ప్రాముఖ్యత గురించి తెలపాలన్నారు. దయానంద యోగా కేంద్రంలో ఉచిత శిక్షణ తరగుతులు నిర్వహిస్తున్నామన్నారు. నిజామాబాద్‌లో యోగాను మొదలు పెట్టిన వ్యక్తి రాఘవ దీక్షితులు అని అన్నారు. ఈ కార్యక్రమంలో యోగా గురువు రాంచందర్, రుక్మన్‌రావు, గురుపాదం, భూమాగౌడ్, మురళీధర్, అశోక్, తోటరాజశేఖర్, సుభాష్, తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గాన్ని సన్మానిస్తున్న దృశ్యం

నిజామాబాద్ అర్బన్, జూలై 29: అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ రాష్ట్ర కోశాధికారిగా జిల్లాకు చెందిన మూడ శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈనెల 27, 28 తేదీలలో ఖమ్మంలో నిర్వహించిన జాతీయ సాధారణ సర్వసభ్య సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జాతీయ అధ్యక్షుడు అయ్యప్ప దాసు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. రెండు సంవత్సరాలకు ఒకసారి నిర్వహించే తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ ఎన్నికలలో వివిధ జిల్లాల నుంచి అధ్యక్ష, కార్యదర్శులు, ఉపాధ్యక్షులు, కార్యనిర్వహణ సభ్యులు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా ఖమ్మంకు చెందిన పుల్లం రాజు, కార్యదర్శిగా బోధన్‌కు చెందిన కర్ణసిద్ధు, కోశాధికారిగా నగరానికి చెందిన మూడ శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా నిజామాబాద్‌కు చెందిన ఇంజనీర్ గంగాధర్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఎన్నికైన నూతన కార్యవర్గం మాట్లాడుతూ ఎరు మేరి సమీపంలో గల నారాయణ తోడులో త్వరలో నిర్మించతలపెట్టిన శాశ్వత నారాయణ భవనానికి వీలైనంత నిధులు సమూకరిస్తామని తెలిపారు.

ఆరోపణలపై విచారణకు సిద్ధం

● సొసైటీ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న సొసైటీ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి

ఇందల్వాయి, జూలై 29: ఇందల్వాయి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో నిధులు దుర్వినియోగం అయ్యాయని పాలకవర్గం డైరెక్టర్లు డీసీవో శ్రీనివాస్‌రావుకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈ ఆరోపణలపై తాను సొసైటీ సీఈవో రతన్ విచారణకు సిద్ధమని సొసైటీ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి అన్నారు. సొసైటీలోని పాలకవర్గం డైరెక్టర్లకు సీఈవో మధ్య ఉన్న చిన్న విభేదాల వల్ల డైరెక్టర్లు డీసీవోకు ఫిర్యాదు చేశారని సొసైటీలో ఎలాంటి నిధుల దుర్వినియోగం కాలేదని చైర్మన్ అన్నారు. డీసీవో శ్రీనివాస్ విచారణకు ఆదేశించాలని విచారణకు వచ్చిన అధికారులకు తాము వంద శాతం సహకరిస్తామని ఆయన అన్నారు. విచారణలో ఎవరు తప్పు చేసినట్లు తేలిన చర్యలు తప్పవని పేర్కొన్నారు.

నూతన వాహనం విడుదల

నిజామాబాద్ అర్బన్, జూలై 29: ద్విచక్ర వాహన రంగంలో అగ్రగామిగా దూసుకెళ్తున్న టీవీఎస్ కంపెనీ మార్కెట్‌లోకి మరో నూతన వాహనాన్ని విడుదల చేసింది. యువత అభిరుచులకు అనుగుణంగా అప్పాచ్చి ఆర్‌టిఆర్ 160-4వి, ఆర్‌టిఆర్ 160-2వి కొత్త మోడళ్లను సోమవారం నగరంలోని ఆర్మూర్ రోడ్‌లోగల లక్ష్మి ఆటో ఏజెన్సీస్ ప్రైవేటు లిమిటెడ్‌లో నిజామాబాద్ రూరల్ ఎస్సై మహేష్ విడుదల చేశారు. అత్యాధునిక ఫీచర్‌లతో యువతను ఆకట్టుకునేలా రూపొందించిన ఈ వాహనాన్ని యువత ఆధరించాలని మహేష్ తెలిపారు. ఎక్స్ షోరూం ధర లక్షా 9వేల 990 నుంచి వివిధ మోడళ్లలో వాహనం లభిస్తుందని షోరూం జనరల్ మేనేజర్ భోజేందర్, మేనేజర్ హరీష్‌లు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీరాం ఫైనాన్స్ మేనేజర్ రాజు, హిందు ఫైనాన్స్ మేనేజర్ శ్రీరాంస్వామి తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న దృశ్యం

నేటి 'చలో హైదరాబాద్'ను విజయవంతం చేయాలి

పెద్దబజార్, జూలై 29: ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించాలని ఈ నెల 30న ఛలో హైదరాబాద్‌లోని కోటి కమిషనర్ కార్యాలయం ఎదుట ధర్నా కార్యక్రమానికి పెద్ద ఎత్తున ఆశావర్కర్లు హాజరై విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్ అన్నారు. సోమవారం నగరంలోని ధర్నాచౌక్‌లో ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆశావర్కర్లకు కనీస వేతనం 18వేల రూపాయలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం, జీతంలో సగం పింఛన్ వారసత్వంకు కొనసాగించాలన్నారు. ఆశావర్కర్ల సేవలను గుర్తించి కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని డీఎంహెచ్‌వోకు వినతిపత్రం అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రేణుక, సుకన్య, స్వప్న, సుజాత, లలిత, శోభ, ఇందిర, హర్ష, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్గో మేనేజర్‌గా బి.పాల్

సుభాష్‌నగర్, జూలై 29: ఆర్టీసీ కార్గో నిజామాబాద్ మేనేజర్‌గా బి.పాల్ బాధ్యతలు స్వీకరించారు. జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ కార్యాలయ ఆవరణలోని కార్గో కార్యాలయంలో బాధ్యతలను స్వీకరించారు. మిర్యాలగూడ డిపో మేనేజర్‌గా పనిచేసిన పాల్ బదిలీపై నిజామాబాద్‌కు వచ్చారు.

కళాశాలలను బంద్ చేసిన ఏబీవీపీ

నిజామాబాద్ అర్బన్, జూలై 29: నగరంలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా సెలవు రోజుల్లో కూడా తరగతులు నిర్వహిస్తున్న పలు కళాశాలలను ఏబీవీపీ నాయకులు సోమవారం బంద్ చేయించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ ఇందూరు విభాగ్ కన్వీనర్ శశిధర్ మాట్లాడుతూ ప్రభుత్వం బోనాల సందర్భంగా సోమవారం విద్యాసంస్థలకు సెలవు ప్రకటించినప్పటికీ నగరంలోని కొన్ని ప్రైవేటు కళాశాలలు తరగతులు నిర్వహించడం నిబంధనలకు విరుద్ధమని కావున ఆ కళాశాలలపై చర్యలు తీసుకోవాలన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం అయితే కళాశాలల గుర్తింపు రద్దు చేసేంతవరకు పోరాటం చేస్తామన్నారు. ఈ సందర్భంగా తరగతులను బహిష్కరించి కళాశాలలను విద్యార్థి సంఘం నాయకులు బంద్ చేయించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాలకృష్ణ, గోపి, దుర్గాదాస్, గణేష్, మహేష్, హర్ష, లక్కి, తదితరులు పాల్గొన్నారు.

నల్లమడుగు నేలమత్తడికి బుంగ!

లింగంపేట, జూలై 29: మండలంలోని నల్లమడుగు నేల మత్తడికి బుంగ పడి నీరంతా వాగులోకి వెళ్లుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సంవత్సరం నెల రోజులకు వరుణ దేవుడు కరుణించి మామూలు వర్షాలు పడితే వచ్చిన వరద నీరు నేలమత్తడికి బుంగ పడడంతో నీరంతా వారం రో జులుగా వాగులోకి వెళ్లుతుందని, ఎండలు కొడితే రైతుల పరిస్థితి ఏమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు. నీటి పారుదల శాఖ అధికారులకు పట్టించుకోవడం లేదని ఇప్పటివరకు చెప్పుకోదగిన వర్షం పడలేదని చెరువులు కుంటలు నిండలేదని ఉన్న నీరువాగులోకి వెళ్లితే సాగుచేసేది ఎలాఅని రైతులు అధికారు లను ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా రెవన్యూ, నీటి పారుదల శాఖల అధికారులు స్పందించి బుంగను పూడ్చి నీటిని ఆపాలని రైతులు కోరుతున్నారు.



అవార్డు అందుకుంటున్న దృశ్యం

ఇందూరు జేసీఐకి అవార్డుల పంట

సుభాష్‌నగర్, జూలై 29: ఇందూరు జేసీఐకి వివిధ విభాగాల్లో అవార్డుల పంట పండింది. ఆదివారం సికింద్రాబాద్‌లో నిర్వహించిన కల్కి మిడ్‌కాన్‌లో అవార్డుల కార్యక్రమంలో జేసీఐ ఇందూరు వివిధ విభాగాల్లో 11 అవార్డులను కైవసం చేసుకుంది. ఉత్తమ కమిటీ డెవలప్‌మెంట్ ఉత్తమ అధ్యక్షుడిగా మనోజ్‌కుమార్, ఉత్తమ జోన్ అధికారిగా నయాన్ జిల్కర్, ఉత్తమ సహాయ పూర్వ అధ్యక్షులుగా విజయానంద్‌లు అవార్డులు అందుకున్నారు.

'డ్రైనేజీ వ్యవస్థ బాధ్యత మున్సిపల్ అధికారులపై ఉంది'

పెద్దబజార్, జూలై 29: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మున్సిపల్ నాలా డ్రైనేజీ వ్యవస్థగా ఉండే విధంగా చూడాల్సిన బాధ్యత మున్సిపల్ అధికారులపై ఉందని సీపీఐ జిల్లా కార్యదర్శి సుధాకర్ అన్నారు. సోమవారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టౌన్‌ప్లానింగ్ అధికారుల నిర్లక్ష్యంతోనే ప్రధాన నగరాల్లో డ్రైనేజీ వ్యవస్థ వైఫల్యం అయ్యిందన్నారు. చిన్నపాటి వర్షానికే వర్షపునీరు ఇండ్లల్లోకి, అపార్ట్‌మెంట్‌లోకి చేరడంతో వరదగా మారుతుందని డ్రైనేజీ వ్యవస్థ ప్రభుత్వ అంచనాల ప్రకారం ఉన్నప్పటికీ కొద్దిమంది టౌన్‌ప్లానింగ్ అధికారులు కొత్తగా నిర్మించుకునే అపార్ట్‌మెంట్, చిన్నపరిశ్రమలకు ఇష్టారీతిన నిర్మాణాలకు అనుమతి ఇవ్వడం మూలంగా నాలాలు పెద్ద పెద్ద డ్రైనేజీలు మూసుకుపోతున్నాయని అన్నారు. నగరాలు చిన్నాబిన్నం చేస్తున్నాయని ఆదివారం ఢిల్లీలో ముగ్గురు సివిల్స్ ఆశావాహులు జలసమాధి కావడం బాధాకరమని అన్నారు. ఈ సంఘటనకు కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

'విప్లవ పార్టీలు ఐక్యం కావాలి'

పెద్దబజార్, జూలై 29: ప్రజల కోసం ప్రజా ఉద్యమాల కోసం ఇప్పుడున్నటువంటి సీపీఐఎంఎల్ పార్టీలు విడివిడిగా ఉన్న విప్లవ పార్టీలు ఐక్యం కావాలని సీపీఐఎంఎల్, ప్రతిఘటన పార్టీ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి క్రాంతి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిఘటన పార్టీ ఉద్యమంలో ఉమ్మడిగా సీపీఐ, సీపీఐఎంఎల్ చంద్రా పుల్లారెడ్డి ఉమ్మడిగా కొనసాగుతున్న క్రమంలో గత ఐదు నెలలుగా కొనసాగుతున్న ఉమ్మడి కార్యక్రమంలో సీపీఐఎంఎల్ సీపీరెడ్డి పార్టీ ఏర్పాటు చేసుకోవడం జరిగిందన్నారు. సీపీఐఎంఎల్, ప్రతిఘటన పార్టీ నాయకులపై అనచివేత కార్యక్రమంలో కుట్రలు, కుతంత్రాలు పన్నుతున్న అవసరమైన నిందలు మోపుతూ మూడు విప్లవ పార్టీల ఐక్యత నిర్మాణంలో ఆర్థిక అంశంలో పార్టీకి పార్టీలో చేస్తున్న కార్యక్రమాలకు ప్రజాకార్యక్రమాలకు ఎటువంటి ఖర్చు పెట్టలేదన్నారు. సీపీఐఎంఎల్, ప్రతిఘటన పార్టీ ఉత్తర తెలంగాణ రాష్ట్ర కమిటీ కార్యదర్శిగా మధు కొనసాగుతారని అన్నారు. గత కొద్ది సంవత్సరాలుగా ప్రతిఘటన ఉద్యమంలో పనిచేస్తున్నటువంటి ఐఎఫ్‌టీయూ షేక్ షావలి, సీపీఐఎంఎల్ చంద్రా పుల్లారెడ్డి పార్టీతో మాకు ఎటువంటి సంబంధం లేదని జిల్లాలో ప్రతిఘటన పార్టీ నాయకులతో సమావేశం జరిగిందన్నారు.



మాట్లాడుతున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్

ఇందూరు సమస్యలపై అసెంబ్లీలో గళమెత్తిన ధన్‌పాల్

పెద్దబజార్, జూలై 29: గెలిచిన ఎమ్మెల్యేలు ప్రజలకు ప్రతినిధులు అని ఓడిపోయిన వారు కాదని ప్రజలు సమస్యలపై తమని అడుగుతారని తాను ఎమ్మెల్యేగా గెలిచినప్పటి నుంచి తన నియోజకవర్గ అభివృద్ధికి ఒక రూపాయి వచ్చిన పాపాన పోలేదని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యానారయణ అన్నారు. హైదరాబాద్‌లో అసెంబ్లీలో మాట్లాడారు. కొడంగల్ నియోజకవర్గంలో పది శాతం నిధులు తమ నియోజకవర్గానికి ఇచ్చిన ఇందూరు నగరం బ్రండాంగ అభివృద్ధి చెందుతుందన్నారు. తన నియోజకవర్గంలో రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేక ప్రజలందరు నానా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఇప్పటికైన నగర అభివృద్ధి కోసం ప్రజల కోసం అర్థం చేసుకుని నగర అభివృద్ధికి నిధులు కెటాయించాలన్నారు. గత ప్రభుత్వం డబుల్‌బెడ్‌రూం విషయంలో కేసీఆర్ ఇచ్చిన మాటను ఇందూరు ప్రజలు ఇప్పటికి మర్చిపోలేదని అన్నారు. గత ప్రభుత్వం 45కోట్ల బడ్జెట్‌తో నిర్మించిన ఐటిహబ్‌ను జిల్లా యువతకు ఉపాధి అవకాశాలు దక్కలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం షుగర్ ఫ్యాక్టరీని తెరిపిస్తామని, అభివృద్ధికి నిధులు కెటాయించలేదని జిల్లాలో బోధన్ షుగర్‌ఫ్యాక్టరీ, పక్కజిల్లాలో ఉన్న ముత్తంపేట్ షుగర్‌ఫ్యాక్టరీ తెరువడమే కాకుండా వాటికి సరిపడ నిధులు కెటాయించాలన్నారు. యూనివర్సిటీలో మౌళిక సదుపాయాలతో పాటు ఇంజనీరింగ్ కళాశాల మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం



సన్మానం చేస్తున్న దృశ్యం

సుభాష్‌నగర్, జూలై 29: గ్రూప్-4 ద్వారా ప్రభుత్వ ఉద్యోగం సాధించి వివిధ హోదాలో పనిచేసి 28 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఉద్యోగులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌లో డీఎస్సీ 1996 బ్యాచ్ గ్రూప్-4 ద్వారా ఉద్యోగం సాధించిన ఉద్యోగులంతా ఒకచోట చేరి సందడి చేశారు. గ్రూప్-4 ద్వారా ఉద్యోగంలో చేరి వివిధ హోదాల్లో పనిచేసిన వారి అనుభవాలను ఒకరినొకరు పంచుకున్నారు. అందులో డిప్యూటీ గణాంక అధికారిగా పదవీ విరమణ చేసిన గంగాధర్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రవీందర్, అనీల్, లక్ష్మణ్, దేవిసింగ్, రాజయ్య, పద్మారావు, సహదేవ్, శివరాజ్, రాములు నాయక్, తదితరులు పాల్గొన్నారు.

కస్తూర్బాలో పలు అంశాలపై అవగాహన

నిజాంసాగర్, జూలై 29: నిజాంసాగర్ పోలీసులు, షీటీం ఆధ్వర్యంలో సోమవారం కస్తూర్బా విద్యాలయంలో విద్యార్థినులకు అవగాహన కల్పించారు. సైబర్ నేరాలు, మూఢనమ్మకాలు, రోడ్డుభద్రత, బాల్య వివాహాలు, డ్రగ్స్, మత్తు పదార్థాలు, తదితరవాటిపై అవగాహన కల్పించారు. మహిళలను, విద్యార్థినులను ఎవరైనా వేధిస్తే 8712686094 నెంబర్‌కు, టోల్ ఫ్రీ 1930కు కాల్‌చేయాలన్నారు. కళాబృందం సభ్యులు పాటలు పాడుతూ విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్సై సుధాకర్, సిబ్బంది ప్రభాకర్, సాయిలు, శేషారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే సురేందర్‌కు అస్వస్థత

ఎల్లారెడ్డి, జూలై 29: ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ అస్వస్థతకు గురయ్యారు. గత కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు సోమవారం ఆయన ఓ వీడియోను విడుదలచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్యం కారణంగా నియోజకవర్గ ప్రజలకు దూరంగా ఉన్నానని, ప్రజల ఆశీస్సులతో కోలుకుని త్వరలో ముందుకు వస్తానని ఆయన పేర్కొన్నారు. నియోజకవర్గ నాయకులు, ప్రజలు ఎవరూ ఆందోళన చెందవద్దని, ప్రజా సమస్యల పట్ల పోరాడటానికి సిద్ధంగా ఉన్నానని తెలిపారు.

పెండింగ్ బిల్లులపై అసెంబ్లీలో మాట్లాడాలని కేటీఆర్‌కు వినతి

నాగిరెడ్డిపేట, జూలై29: గ్రామ పంచాయితీలతోపాటు మండల జిల్లా పరిషత్‌లకు రావాల్సిన పెండింగ్ బిల్లులపై అసెంబ్లీలో మాట్లాడాలని మాజీ మంత్రి కేటీఆర్‌ను రాష్ట్ర జడ్పీటీసీల ఫోరం మాజీ ప్రధాన కార్యదర్శి మనోహర్‌రెడ్డి కోరారు. ఆయన సోమవారం అసెంబ్లీలో మాజీ మంత్రి కేటీఆర్‌ను కలిసి పెండింగ్ బిల్లుల విషయమై కోరినట్లు మనోహ ర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం అసెంబ్లీ సమావేశాల్లో పంచాయితీ రాజ్ పై చర్చ జరుగుతుందని, ఈచర్చలో భాగంగా గ్రామ పంచాయితీలకు రావాల్సిన పెండింగ్ బిల్లులు రాక మాజీ సర్పంచ్‌లు ఇబ్బందులు పడు తున్నారని ఆయన దృష్టికి తీసుకెళ్లినట్లు ఆయన తెలిపారు. గ్రామ పంచాయతీల పెండింగ్ బిల్లులతోపాటు మండల, జిల్లా పరిషత్‌లకు రావాల్సిన పెండింగ్ బిల్లులపై అసెంబ్లీలో మాట్లాడాలని, పెండింగ్ బిల్లులను ప్రభుత్వం మంజూరు చేసేలా తగు చర్యలు తీసుకోవాలని మాజీ మంత్రి కేటీఆర్‌ను కోరినట్లు మనోహర్‌రెడ్డి తెలిపారు.

చికెన్ ధరలు

రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.100	రూ.220	రూ. 240
వెన్‌కాబ్(కిలో)	రూ.105	రూ.225	రూ. 245

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.72,200	రూ.66,600	రూ.875

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : డెడ్‌పూల్ (తెలుగు 3డీ) (10.15, 1.15)
: డెడ్‌పూల్ (ఇంగ్లీష్ 3డీ) (4.15, 7.15, 10.15)
స్క్రీన్-2 : కల్కి (3డీ తెలుగు) (11.20, 6.15)
: రాయాన్ (3.05, 10.00)
స్క్రీన్-3 : బ్యాడ్ న్యూజ్ (హిందీ) (10.00, 4.15, 10.30)
: పురుషోత్తముడు (1.05)
: ఆపరేషన్ రావన్ (7.20)
స్క్రీన్-4 : రామ్ ఎన్ఆర్ఐ (10.10)
: గల్లీ గ్యాంగ్ స్టార్స్ (1.00)
: ట్విస్టర్స్ (ఇంగ్లీష్) (4.20)
: రాయన్ (7.10)
: పురుషోత్తముడు (10.20)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : రాయన్ (10.45, 1.35, 4.30, 7.25, 10.20)
స్క్రీన్-2 : డెడ్‌పూల్ (తెలుగు 3డీ) (11.00, 1.40, 7.30)
: కల్కి (తెలుగు) (4.15, 10.20)
స్క్రీన్-3 : డెడ్‌పూల్ (తెలుగు 3డీ) (10.40)
: కల్కి (1.20, 7.20)
: డెడ్‌పూల్ (ఇంగ్లీష్ 3డీ) (4.45)

దేవి : రాయన్ (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : డెడ్‌పూల్ (తెలుగు) (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : కల్కి (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్